**ప్రతి మనిషికి ఒకే విలువ కోసం...**

# మానవ హక్కుల వేదిక

**పశ్చిమ గోదావరి జిల్లా శాఖ మహాసభ**

**17.11.2019 ఆదివారం ఉదయం 10 గంటలకు**

**అద్దేపల్లివారి సత్రం, గాంధీబొమ్మ సెంటర్, పాలకొల్లు**

సమాజంలో వ్యవస్థీకృతంగా ఉన్న అసమానత, అణచివేతలు హక్కుల లేమికి మూలమని హక్కుల ఉద్యమం గుర్తిస్తుంది. రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక తదితర రంగాల్లో కొనసాగుతున్న అన్ని రకాల అసమానత, అణచివేతలను వ్యతిరేకించే దిశగా కృషి చేస్తుంది. ప్రకృతి వనరుల మీద అసమాన యాజమాన్యం, ఆదివాసుల మీద మైదాన ప్రజల పెత్తనం, దళితుల మీద కుల దురహంకారుల పెత్తనం, మహిళల మీద మగవాళ్ళ పెత్తనం, మైనారిటీ మతస్తుల మీద ఆధిపత్య మతోన్మాదుల పెత్తనం, వెనుకబడిన ప్రాంతాల మీద అభివృద్ధి సాధించిన వారి పెత్తనం, ప్రపంచీకరణ పేరిట ప్రపంచ పెట్టుబడిదారీ పెత్తనం, రాజ్యాంగ యంత్రాంగానికి పౌరుల మీద ఉండే అణచివేత అధికారాలతో పాటు అణచివేత వ్యవస్థలన్నీ హక్కుల లేమికి, హక్కుల అతిక్రమణకి మూల కారణాలుగా పరిగణిస్తుంది.

అణచివేతకు గురయ్యే ప్రజలు తమ హక్కుల కోసం, తమ జీవితాల మెరుగుదల కోసం పోరాటాలు చేస్తుంటారు. అటువంటప్పుడు ప్రత్యేకంగా ఒక హక్కుల ఉద్యమం ఆవశ్యకత ఏమిటనే ప్రశ్న తలెత్తుతుంది. అయితే పలు సందర్భాల్లో సంఘటితం కాలేని ప్రజలు, ఉద్యమించలేని ప్రజలు అనేక మంది ఉంటారు. ఈ పరిస్థితిని అధిగమించడం కోసం, ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల సాధన కోసం కృషి చేయడం హక్కుల ఉద్యమం కార్యరంగంగా ఎంచుకుంది. అంతేకాకుండా, ఏ అణచివేతనూ అనుభవించని వారిలో దాని గురించిన అవగాహనని, ప్రతిఘటించే కార్యాచరణ పట్ల సానుభూతిని పెంపొందించే ప్రయత్నం చేస్తుంది. పోరాట ప్రజలు కాని వారిలో సంఘీభావాన్ని కూడగడుతుంది. ఈ దృక్పథంతో మానవ హక్కుల వేదిక గత రెండు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల ప్రజలతో కలిసి పనిచేస్తుంది.

నిన్నటి వరకు భౌతిక హింసకి మాత్రమే పరిమితమైన మతోన్మాద రాజకీయం నేడు దళితుల, మైనారిటి మతస్తుల సంస్కృతిలోకి, కులవృత్తిలోకి, భావజాలంలోకి తాత్విక హింసగా చొరబడుతుంది. రాజ్యాంగం ప్రకారం లౌకికవాదమంటే మతరహిత సమాజమని అర్థం కాదు. ప్రభుత్వమూ, మతమూ కలగలిసిపోకుండా ఉండటమని. 'ఒకే దేశం, ఒకే భాష' నినాదం వెనుక ఆర్.ఎస్.ఎస్. లక్ష్యమైన హిందూత్వ రాజ్యస్థాపన అనే సంగతి కొత్తగా చెప్పుకోనక్కరలేదు. సుప్రీమ్‌కోర్టు రామజన్మభూమి కేసులో ఇచ్చిన తీర్పు కూడా అదే ధోరణిలో వుంది.

రిజర్వేషన్ల మీద సమాజంలో సామరస్యపూర్వకంగా చర్చ జరగాలని ఆర్.ఎస్.ఎస్. నాయకుడు మోహన్ భాగవత్ మళ్ళీ ప్రతిపాదించారు. విశ్వవిద్యాలయాల్లో సైతం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కులవివక్ష, అణచివేతలకు గురవుతున్న వ్యవస్థలో; గరగపర్రులో దళితుల సాంఘిక బహిష్కరణ జరిగిన వర్తమానంలో ఏ అంశాన్ని తక్షణం చర్చించాలంటారు? రిజర్వేషన్లనా, వాటికి అసలు కారణాలైన కులవివక్ష, అసమానతలనా అనే ఎంపిక మన విచక్షణకి సంబంధించింది. ప్రస్తుతం దేశంలో ఒక అనధికార అత్యవసర పరిస్థితి వంటి సంక్షుభిత వాతావరణం నెలకొంది. ప్రధానమంత్రి హత్యకు కుట్ర చేశారనే ఆరోపణతో పలువురు మేధావులను నిర్బంధంలోకి తీసుకుని సంవత్సర కాలమవుతుంది. ఆఖరికి ఆర్టికల్ 370 రద్దుని వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాలు ఇటీవల నిర్వహించిన కావలి సభలో పాల్గొన్న నాయకులపై కేసులు బనాయించి భావప్రకటన స్వేచ్ఛని అణచివేసే స్థాయికి చేరుకుంది.

ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలవల్ల సంక్షోభం ఎదుర్కొంటున్న ఆర్థిక రంగాన్ని గాడిలో పెట్టే చర్యలు తీసుకోవటం లేదు. నిరుద్యోగ సమస్య, వ్యవసాయ సంక్షోభం తీవ్రతరం అవుతుంటే కార్పొరేటు కంపెనీలకు వేల కోట్ల రూపాయల ఋణమాఫీలు చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో సహజవనరులను విధ్వంసం చేస్తున్నారు. స్థానికుల జీవించే హక్కును నాశనం చేస్తున్నారు. మన జిల్లాలో తుందుర్రు, పేరుపాలెం గ్రామాల్లో ఇది ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం.

ఈ క్రమంలో మానవ హక్కుల వేదిక ఇరవయ్యేళ్ళుగా తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తుంది. మహిళలు, దళితులు, మైనారిటి మతస్తులపై వివక్ష, అణచివేత, దాడులు మొదలుకొని రైతు ఆత్మహత్యలు; విధ్వంసకర అభివృద్ధి; సహజ వనరుల దోపిడి; పర్యావరణ సమస్యల వరకు వివిధ కార్యక్రమాలను చేపడుతుంది. మతోన్మాద ఘటనలకు వ్యతిరేకంగా, ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఊరేగింపులు, సభలను నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో ఇవాళ ఒక శక్తివంతమైన హక్కుల ఉద్యమం అవసరమని ఆలోచనాపరులకి తెలియజేస్తుంది. అందరినీ ఈ సభకి ఆహ్వానిస్తుంది.

## కార్యక్రమం

**అంశం : రిజర్వేషన్లు – ప్రజాస్వామిక దృక్పథం**

వక్త : కె.సుధ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మానవ హక్కుల వేదిక

**అంశం : తుందుర్రు మెగా ఆక్వా ఫుడ్ పార్క్ – పర్యావరణ సమస్యలు**

వక్త : సముద్రాల సత్యవాణి, పోరాట కమిటీ సభ్యురాలు

**అంశం : పేరుపాలెం తీరప్రాంత ఆక్రమణ – మత్స్యకారుల హక్కుల ఉల్లంఘన**

వక్త : తిరుమాని శ్రీను, మత్స్యకార సంఘ సభ్యులు

**అంశం : విధ్వంసకర అభివృద్ధి**

వక్త : జి. రోహిత్, కన్వీనర్, కృష్ణా జిల్లా, మానవ హక్కులవేదిక

**అంశం : ఆర్థిక సంక్షోభం**

వక్త : వై. రాజేష్, కార్యదర్శి, మానవ హక్కులవేదిక

**– మానవ హక్కుల వేదిక**
**పశ్చిమ గోదావరి**

*ప్రచురణ : టి. ఆనందరావు, జిల్లా అధ్యక్షులు, 9703808505*